


# రచయిత్రి మొగుడు

— తిరుమలశ్రీ

పెళ్ళిచూపులకు వెళ్ళిన రాజారాం, ఆ అమ్మాయి ప్రఖ్యాత రచయిత్రి అహల్య అని తెలియడంతో ఎగిరి గంతేసాడు. ఆమె అందగత్తె కాకపోయినా, అనాకారి మాత్రం కాదు. ఆమెవంక అభిమానంగా చూసాడతను

వాళ్ళ నాన్న కనీసం పదివేలయినా రాబట్టాలని చూస్తూంటే, తనకు కట్నమే అవసరంలేదని ప్రకటించేసి, పెళ్ళికి తన సమ్మతిని తెలియబరిచాడు రాజారాం.

మొదట 'గఁయ్'మన్నా చివరకు ఒప్పుకున్నాడు వాళ్ళ నాన్న. అందుకు రెండు కారణాలు వున్నాయి. మొదటిది — పిల్ల అందమైనదైతే తిప్ప పెళ్ళిచూపు

లకు రానననే కొడుకు, ఆమె రచయిత్రి అనగానే కట్నం కూడా వద్దనేంతటి మోజు పెంచుకున్నాడు ఆమె మీద. అందమో అని మొత్తుకునేవాడు కాస్తా, ఆ విషయమే మరిచిపోయినట్లున్నాడు. అటువంటప్పుడు కాదన్నా వినడు వాడు. ఇక రెండవ కారణం – బంగారు గ్రుడ్లు పెట్టే బాతే తమ సొంతమవుతున్నప్పుడు గ్రుడ్ల కోసం దేవుళ్లాడడం అనవసరం అనుకున్నాడు అతను. ఆ పిల్ల పేరున్న రచయిత్రి. బోలెడు డబ్బులు కూడా సంపాదిస్తుంది అటువంటప్పుడు కట్నం కోసం ఆమెను వదులుకోవడం తెలివి తక్కువే అవుతుంది... ఇవన్నీ ఆలోచించి రాజారాం తండ్రి ఆ సంబంధానికి అంగీకరించాడు. కొడుక్కి కట్నం తీసుకోలేదన్న మంచిపేరు కూడా వస్తుం దనుకున్నాడు.

రాజారాంను, మిత్రులంతా అభినందించారు – అహల్యవంటి ప్రముఖ రచయిత్రి అతనిభార్య అవుతున్నందుకు. మిత్రులు పొగుడుతూంటే చంద్రమండలానికి హనీమూన్ వెళ్ళినంతగా సంబర పడిపోయాడు అతను.

శోభనం గదిలో ఆతృతగా అహల్య కోసం ఎదురుచూస్తున్నాడు రాజారాం.

అతని మదిలో, అహల్య నవలల్లో వర్ణించే శోభనపురాత్రి, మనోల్లాసాన్ని కలిగించే వధూవరుల డైలాగ్సూ మెదిలాయి. తన అభిమాన రచయిత్రే తన అర్ధాంగి అయినందుకు, ఆ రాత్రి ఆమె పొందులో అనుభవించబోయే సర్వ సౌఖ్యాలను వూహించుకుని ఆనందంతో గాలిలో తేలిపోతున్నాడు. ఎప్పుడెప్పుడు ఆమెను తన బిగి కౌగిట్లో బంధించి వేద్దామా అని వువ్విళ్లూరాడు.

కాసేపటికి అమ్మలక్కలంతా అహల్యను గదిలోకి త్రోసి తలుపులు మూసారు.

పాలనురగలాంటి తెల్లని చీరలో, వెన్నెల్లా మెరిసిపోతోంది అహల్య. ఆమె తలలోని మల్లెల సౌరభాలు గదంతా వెదజల్లుతున్నాయి. నునుసిగ్గుతో తల వంచుకుని గుమ్మంవద్దే నిలుచుండిపోయింది అహల్య. ఆమెను ఆ భంగిమలో చూస్తూంటే మరింత అందంగా కనిపించింది రాజారాంకు.

"అహల్యా!...." అన్నాడు మెల్లగా.

ఓరగా అతనివంక చూసి సిగ్గుతో మరింత కిందికి వంచుకుంది శిరస్సు.

నవ్వుకుని ఆమెను సమీపించాడు రాజారాం

మల్లెపూలను ఒకసారి గట్టిగా ఆఘ్రాణించి, ఆమెచుట్టూ చేతులు వేసి తనవైపుకు త్రిప్పుకున్నాడు. సిగ్గుతో మొగ్గే అయింది అహల్య. వంచిన తల ఎత్తకుండానే అతని హృదయానికి హత్తుకుపోయింది.

పాతికేళ్ళ, అహల్య – అవివాహిత అయినా, శోభనపు రాత్రులను గూర్చి

ఎంతో రమణీయంగా చిత్రించే అహల్య తనవరకు వచ్చేసరికి స్త్రీ సహజమైన సిగ్గుతో భర్త గుండెల్లో ముఖం దాచు కోవడం, రాజారాంకు నవ్వు తెప్పిం చింది, ముచ్చటవేసింది.

మెల్లగా ఆమెను బెడ్‌వద్దకు నడిపిం చుకు వెళ్ళాడు.

ఆమె సిగ్గును పోగొట్టాలని అతను ప్రయత్నించేకొలది మరింతగా ముకుళిం చుకు పోతోంది.

"అబ్బ, ప్రఖ్యాత రచయిత్రికి ఇంత సిగ్గయితే ఎలా ?" అంటూనే ఆమె పెదవులపైన చుంబించాడు రాజారాం. స్వీటు సగం కొరికి నోటితోనే ఆమె నోట్లోకి త్రోసాడు. సిగ్గుపడుతూనే స్వీకరించిందామె. కన్నులు మూసుకుని బల్లిలా అతని ఛాతికి హత్తుకుపోయింది.

ఆమె సిగ్గును పోగొట్టి దారికి తెచ్చు కునేసరికి 'హమ్మయ్య' అనుకున్నాడు రాజారాం, 'ఈ రచయిత్రికి ఎంత సిగ్గు!' అనుకుంటూ.

స్వర్గలోకాలలో విహరిస్తున్న రాజారాం, అహల్య హఠాత్తుగా లేవ డంతో ప్రశ్నార్థకంగా చూసాడు. వదిలితే మళ్ళీ చేతికి దొరకదేమోనన్నట్లు, మరింతగా పెనవేసుకుని, ఆమె పెదాలకు తన పెదాలను చేర్చాడు.

"ప్లీజ్...." అందామె.

ఎందుకన్నట్లు కళ్ళతోనే ప్రశ్నిం చాడు, వదలకుండానే.

"మంచి ఆలోచన ఒకటి వచ్చింది... కథకు ప్లాట్ రాసుకుని వచ్చేస్తాను" అందామె, అతని చేతులు విడిపించు కుంటూ.

ఆశ్చర్యంగా చూశాడు రాజారాం.

"ప్లాటా ?" అన్నాడు.

"వూఁ—" అంది గోముగా.

ఆ క్షణంలో ఆమెని వదలబుద్ధి కావడంలేదు అతనికి. చక్కని మధు రానుభూతిలో వుండగా—మధ్య—ఈ ప్లాటే మిటి, పానకంలో పుడకలా అనిపించింది. అసలు తెల్లవారేంతవరకు అహల్యను తన కౌగిట్లోనుండి కదలనివ్వకూడదని వుంది

కాని....

ఏదో మంచి ఆలోచనట....కథకు ప్లాటవుతుందట....

బహుశా, ఈ మధురానుభూతి ఆమెలో మధురోహలను రేపి వుంటుంది. ఆమెలోని రచయిత్రిని మేల్కొలిపి వుంటుంది.... అనుకున్నాడు.

అయిష్టంగానే కౌగిలి సడలించాడు.

కాగితమూ, కలమూ ముందే ఆ గదిలో వున్నాయి కాబోలు సిద్ధంగా. టేబిల్ దగ్గర కూర్చుని కొంటెగా అతనివైపో చిరునవ్వు విసిరి, వ్రాతకు వుపక్రమించింది.

ఆమె తలవంచుకుని చకచకా రాసు కుంటూంటే – బెడ్‌పైన పడుకునే, అందంగా కదులుతూన్న ఆమె చేతివంక

ఆమెవంక ఆరాధనగా, ఆప్యాయంగా చూస్తూ వుండిపోయాడు రాజారాం.

అలా ఎంతసేపు వున్నాడో తెలియదు. చూస్తూ చూస్తూనే నిద్రాదేవి వొడిలో వొరిగిపోయాడు.

తెల్లవారాక మెలకువ వచ్చిన రాజారాంకు ప్రక్కలో అహల్య కనిపించలేదు

రాత్రి అనుభూతులు ఒక్కొక్కటే గుర్తుకొచ్చాయి. అహల్య రాసుకోవడమూ, తాను ఆమెను చూస్తూనే నిద్రపోవడమూ జ్ఞాపకం వచ్చాయి.

అపురూపమయిన మొదటి రాత్రిలో చాలాభాగం వృధా అయిపోయిందే అనిపించింది అతనికి.

## 2

తనకు హోటల్ భోజనం పడలేదంటూ నెల తిరక్కుండానే భార్యను తీసుకొచ్చి కాపురం పెట్టేశాడు రాజారాం, అన్నాళ్ళూ పడిన హోటల్ భోజనం పెళ్ళవగానే పడడం మానేసిందన్నట్లు.

రాజారాం ఏదో కోపరేటివ్ బ్యాంకులో పనిచేస్తున్నాడు.

చిన్నదయినా, చూడ ముచ్చటగా వున్న రెండు గదుల ఇంట్లో భార్యాభర్త లిద్దరే వుంటున్నారు.

రాజారాంకు లోకమంతా ఎవర్ గ్రీన్ గానూ, జీవితం అద్భుతంగానూ కనిపిస్తోంది, అహల్య వచ్చినప్పటినుండీను. ఆఫీసు వేళల్లో తప్పితే, ఇతర సమయాల్లో భార్యను ఒక్క నిముషం కూడా విడిచి వుండడం లేదతను.

అహల్యకు వంట ప్రయత్నంలో సాయంచేయడం మొదలు, ఆమె కథలు ఫెయిర్ చేయడంవరకు—సంతోషంగా చేస్తున్నాడు.

అతని మిత్రులు, పరిచయస్తులూ రాజారాంను ఫలానా 'రచయిత్రి భర్త'గా పిలుస్తూంటే ఎంతో గర్వంగా వుండేదతనికి. అహల్య నవల,కథలు ప్రచురణ అయినప్పుడల్లా అంతా అతన్ని అభినందిస్తూ వుండేవారు. కొందరయితే 'రచయిత్రి భర్త' గా అతని అనుభవాలను గురించి ప్రశ్నిస్తూ వుండేవారు.

మొత్తానికి రాజారాంకు ఏదో థ్రిల్లూ, తెలియని ఆనందమూ కలుగుతూ వుండేవి.

అయితే—

రోజులు ఎప్పుడూ ఒకేలాగునవుంటే జీవితం చేదుగా వుంటుందేమో!

ఏ వస్తువు గాని, విషయం గాని క్రొత్తలో వున్న మోజును, కుతూహలాన్ని చిరకాలం కారీ చేయలేదు. క్రొత్తమోజులో కనిపించని అవలోపాలు పాతబడేకొద్దీ అనుభవంలో వెలికి వస్తూంటాయి. ఇది సహజం.

అహల్యకు అవకాశం లభించినప్పుడు మాత్రమేకాక, అహర్నిశలూ - రచనా వ్యాపకంలోనే కూరుకుపోవడంతో రాజారాంకు విసుగు కలుగసాగింది.

ఉదయం లేచేసరికే ఏదో రాసుకుంటూ కూర్చొనేది. వ్రాత అయ్యాక హడావుడిగా వంట ప్రారంభించేది, ఇద్దరూ కలిసిచేసినా ఆఫీసు టైముకు వంట కావడం గగనమయ్యేది. ఒక్కోసారి అన్నం తీసుకు వెళ్ళకుండానే వెళ్ళిపోతూండేవాడు రాజారాం, హోటల్లో తినేస్తాన్లే అంటూ.

సాయంత్రం బ్యాంకు క్లోజు చేయగానే ఇంటికి పరిగెత్తు కొచ్చేవాడు, భార్యతో ఎక్కడికైనా షికారుకుగాని, సినిమాకుగాని వెళ్లాలని అతను వచ్చేటప్పటికి సీరియస్‌గా ఏదో రాసుకుంటూ కూర్చొనేది అహల్య. ఫ్లాస్క్ లో కాఫీ వుంది పోసుకు త్రాగమనేది, కూర్చున్న చోటినుండి కదలకుండానే!

ఉసూరు మనిపించేది రాజారాంకు.

అతను ఎదురుచూసేది వేరు .... అహల్య నవలల్లోని కథానాయకిలా వుండాలి తన భార్య.

భర్త అలసి సొలసి ఇంటికి వచ్చేసరికి పెదవులపైన చిరునవ్వుతో, చేతిలో కాఫీ కప్పుతో ఎదురువస్తుంది - అహల్య కథానాయిక. అప్పుడతను భార్య ముఖంచూస్తూనే తన శ్రమంతా మరచిపోతాడు. ఆమెను దగ్గరకు తీసుకుని, పెదవులపైన ముద్దులవర్షం కురిపిస్తూ, ఆమె త్రాగిస్తూంటే కాఫీ సిప్ చేస్తాడు. మధ్యమధ్య ఆమెకూ పట్టిస్తాడు ... ఇదీ రాజారాం కలలుకనే భార్య.

కాని—

అహల్య.. !?

ఆ శృంగారాలన్నీ తన నవలల్లోని నాయికలకే పరిమిత మన్నట్లు తన నిజ జీవితంలో ఒక్కనాడూ ప్రదర్శించిన. పాపాన పోలేదు. అన్నిటికంటె యీ లోకంలో రచనావ్యాసంగ మొకటే ప్రధానమన్నట్లు ప్రవర్తిస్తుంది.

షికారుకు వెళదామంటే కాళ్ళు నొప్పులూ, టైమ్ వేస్టూ అంటుంది. ఇరవై నాలుగ్గంటలూ రాస్తూకూర్చుంటే చేతులు నొప్పులు పుట్టవు కాబోలు!

సినిమాకు వెళదామంటే తాను రైటింగ్ మూడ్‌లో వుందనీ, మరోనాడు వెళదామనీ అంటుంది. దాంతో అతని మూడ్ మారిపోతుంది. ఇక ఎన్నడూ సినిమా పూసే ఎత్తకూడ దనిపిస్తుంది.

సాయంకాలం ఎక్కడికీ రాకపోతే మానింది, పోనీ కాసేపు కూర్చుని సరదాగా కబుర్లు చెప్పుకుందామన్నా వీలుపడదు.

ఫలానా పత్రికకు సీరియల్ రాస్తున్నాను. ఇంకా పాతిక పేజీలు రాస్తే పూర్తయిపోతుంది ... ప్లీజ్! ఈ పూట కాస్త వంటపని మీరే చూసుకోరూ? అంటోంది.

'హతోస్మి!' అనుకుంటూ వంటయింటి ప్రవేశం చేయక తప్పదితనికి. సరదాగా గడపవలసిన ఆ సాయంత్రం అలా సాంబారు, పులుసులతో కుస్తీపట్ట

వలసి వచ్చేసరికి ఎక్కడలేని చికాకూ వచ్చేసేది. అది ఎవరిమీద చూపాలో తెలియక, తప్పేళాలపైన, పోపుడబ్బాల పైనా చూపించేవాడు.

ఒకవేళ వంటపని తప్పితే, నవలో, కథో ఫెయిర్ చేసిపెట్టమని ముందు పడే సేది....పగలంతా ఆఫీసులో పనిచేసి వస్తే, సాయంత్రం కూడా కాగితాలతో కుస్తీ పట్టాలంటే విసుగనిపించేది.

పోనీ, రాత్రికయినా భార్య పక్క లోకి వస్తుందేమోనని ఆశతో ఎదురు చూసేవాడు.

అతని మనసు గ్రహించినదానిలా వచ్చి గాఢంగా ఒక ముద్దిచ్చి, "ప్లీజ్! ఓ పది పేజీలు రాసుకుని వచ్చేస్తాను.... బుద్ధిగా పడుకోరూ!" అంటూ వెళ్ళి పోయేది.

టేబిల్ లాంప్ వెలుతురులో సీరియస్‌గా రాస్తూ కూర్చునే భార్యను చూస్తూ, పురివిప్పుకున్న కోర్కెలతో, సలసల కాగే ఒంటితో నిద్రపట్టక చాలా సేపు బెడ్‌మీదే దొర్లేవాడు అతను. ఆ తర్వాత ఎప్పుడు నిద్రపోయేవాడో తెలిసేదికాదు ...తాను రేగే కోర్కెలతో వేగిపోతున్నప్పుడు ఆమె రాదు. ఆమె ఏ అర్ధరాత్రో ప్రక్కలో చేరేసరికి తాను గాఢనిద్రలో వుంటాడు ..'ఏం జీవితంరా బాబూ' అనుకుని నిట్టూర్చేవాడు.

దాదాపు ప్రతిరోజూ ఇదే చర్య కావడంతో విసుగెత్తిపోయాడు, రాజారాం. ఎప్పటికప్పుడు 'తప్పుతుందా, రచయిత్రి మొగుడాయె తాను!' అని సరిపెట్టుకోజూసేవాడు.

ఆ మధ్య మరో బెంగ పట్టుకుంది అతన్ని.

పెళ్ళికానంతవరకు 'ఫలానా రాజా రాంగారు' అంటూ తనను గుర్తించే వాళ్ళంతా పెళ్ళయ్యాక 'ఫలానా రచయిత్రి మొగుడు'గా ముద్రవేసేసారు. తనపేరు మరిచిపోయినట్లు 'ప్రముఖరచయిత్రిగారి హస్బెండు' అంటూ ఆడా, మగా తనను పిలుస్తూంటే-తన ఒరిజినల్ ఐడెంటిటీని కోల్పోయినట్లు ఫీలవసాగాడు.

క్రమంగా అహల్య రచనలకు గిరాకీ పెరగడంతో, ఆమెకు చేతినిండా పని కూడా పెరిగిపోతోంది. పత్రికలు, ప్రచురణ సంస్థలు ఆమెను అప్రోచ్ చేయడంతో కమిట్‌మెంట్స్ ఎక్కువయి తీరికలేకుండాపోయిం దామెకు. చివరకు ఇంటిపనులను గూర్చి ఆలోచించే వ్యవధి కూడా లేకుండా పోయింది.

ఇలా వుండగానే, మరో మెంబరు వారి మధ్యకు రావడం జరిగింది.

పాపాయిని చూసుకునయినా తన రచనా వ్యాసంగాన్ని తగ్గించుకుంటుం దేమోనని ఆశించిన రాజారాంకు ఆశా భంగమే అయింది—

రాసుకుంటూంటే, పసిపిల్ల గుక్క పెట్టి ఏడుస్తున్నా తెలిసేదికాదు అహల్యకు. భర్త ఇంటిదగ్గరే వుంటే,



పిల్లను అతని కప్పగించేసేది, పాల సీసాతో సహా. పైగా, తల్లికోసం ఏడుస్తూ చేతుల్లోనుండి జారిపోతున్న చంటిదాన్ని ఎత్తుకోవడం చేతకాక, సతమతమయ్యే భర్తను చూసి కొంటెగా నవ్వేది. ఆమె నవ్వు అతనికి వొళ్లు మండించేది. 'ఇంకా నయం, నావల్ల కాని పనయిందిగాని, లేకుంటే పిల్లను కూడా నన్నే కనమనేదేమో తన బదులు!' అనుకున్నాడు.

భార్య రచనలు చేయడం ఇష్టమే! తన భార్య ఓ సుప్రసిద్ధ రచయిత్రి అని చెప్పుకోవడానికి అతను గర్వపడతాడు. అలాగని, ఇతర విషయాలేవీ పట్టించుకోకుండా భర్తను, పిల్లల్ని సయితం విస్మరించి కేవలం రచనలే లోకంగా, అదే పిచ్చిగా, ఇల్లూ, వొళ్లూ గుల్లచేసుకుని రాయడం మాత్రం అతనికి కిట్టదు. అవసరానికి ఒక్కోసారి రోజస్తమానం కూర్చుని రాసినా కాదనడు. కాని, అదే దినచర్యగా పెట్టుకుని, తనను, పిల్లను నిర్లక్ష్యంచేస్తుంటే సహించలేక పోయేవాడు.

ఆ విషయమే ఒకసారి ఖచ్చితంగా

చెప్పేసాడు అహల్యతో. అలాగైతే మొత్తానికి రచనలే మాన్పించివేయాల్సి వుంటుందని బెదిరించాడు.

అందువల్ల కొద్దిరోజులు సాయంగా వుంటుందని చెల్లెలు శశిరేఖను రప్పించుకుంది అహల్య.

శశిరేఖ పి.యు.సి తో చదువాపేసింది. ఇక పెళ్ళిచేసి అత్తారింటికి పంపెయ్యాలనుకుంటున్నాడు తండ్రి.

శశిరేఖ అక్కయ్యకంటె అందంగా వుంటుంది. చిన్నపిల్లయినా ఏమాత్రం విసుక్కోకుండా ఇంటిపని, వంటపని అంతా చూసుకునేది. పసిదాన్ని కన్నతల్లిలా సాకేది. బావగారికి ఏ కష్టమూ కలగకుండా ఏమేం కావాలో అన్నీ వేళకు అమర్చిపెట్టేది.

చెల్లెలు రావడంతో పూర్తిగా రాతలో పడిపోయిన అహల్యకు, అన్ని విధాలా చేదోడుగా ఉండేది శశిరేఖ. చంటిది పడుకున్నంతసేపూ అక్కయ్య నవలలు ఫెయిర్‌చేసి పెట్టేది.

మరదలి రాకతో ఇతర ఇబ్బందులంటే తప్పాయి కాని, అసలు ఇబ్బంది అలాగే వుంది. అది తీర్చగలది అహల్య ఒక్కతేనాయె!

ఎప్పుడైనా మరీ బోర్‌కొడితే అలా బయటకు తిరిగొద్దాం రమ్మనేవాడు రాజారాం, భార్య విషయం తెలుసుండీ.

తాను రాసుకోవలసింది బోలెడు ఉందనో, లేక ఏదో నవలో, కథో ముగింపు ఘట్టంలో వున్నదనో చెప్పేది అహల్య. చెల్లెల్నీ! అతన్నీ వెళ్ళి రమ్మనేది. విసుగెత్తిన రాజారాం మరదలితో కలిసి చంటిదాన్ని తీసుకుని వెళ్ళిపోయేవాడు. ఆ విధంగా ఆ మధ్య శశిరేఖతో సినిమాలకు షికార్లకు వెళ్ళొస్తూనే వున్నాడు. కాని, భార్య ప్రక్కన లేదన్న లోటు, ఏ మూలో ఏదో అసంతృప్తి తేలు కొండిలా పొడుస్తూ వుండేవి.

రాత్రులు భార్య పక్కలోకి రావడం లేదన్న లోటు తప్పితే – ఇతర విషయాలలో మరే లోటూ లేకుండా అతన్ని చూసుకునేది శశిరేఖ. ఆ ఒక్క లోటూ తప్పిస్తే భార్యకంటె ఎక్కువగా చూసుకుంటోంది. ఆ పిల్ల ప్రేమాభిమానాలకు, సి స్సి యా రి టీ కి ముగ్ధుడయ్యేవాడు రాజారాం.

ఇలా వుండగా ఒకసారి అహల్యకు పొరుగూరులోని ఏదో మహిళా మండలి నుండి ఆహ్వానం వచ్చింది – తమ వార్షికోత్సవ సందర్భంగా ఆమెకు సన్మానం జరుపదలుచుకొన్నట్లు. సంతోషంతో పొంగిపోయింది అహల్య.

మరో స్థితిలోనయితే అది రాజారాంకూ సంతోషదాయకంగానే వుండేది. కాని, అప్పటి పరిస్థితి వేరు!....కొద్ది రోజులుగా అతనికి భార్యపైన కోపంగా వుంటోంది. తెలియకుండానే దంపతుల మధ్య దూరం ఏర్పడింది. యవ్వనంలో వుండగానే కోర్కెలను తీర్చుకోలేక

పోతే, ముసలివాళ్ళయ్యాకనా అనిపించే దతనికి. భార్య తెలివితక్కువ కారణంగా తాను కోర్కెలు చంపుకోవలసిరావడం అతనికి చిరాకు తెప్పిస్తోంది.

అందుకే ఆమె తనకూడా రమ్మంటే రానన్నాడు. ఒక్కర్తెనే పంపించాడు.

## 3

అహల్య తిరిగివచ్చేసరికి నాలుగు రోజులు పట్టింది.

ఆమె రాగానే, "మీవాళ్ళు ఇప్పుడే వెళ్ళారు. మీ పుట్టింటికి కాబోలు బయలు దేరారు," అంటూ ప్రక్కింటావిడ వచ్చి ఇంటి తాళంచెవీ, ఓకవరూ అందించింది.

అంత హఠాత్తుగా తన పుట్టింటికి బయలుదేరారనేసరికి ఎవరికెలా ఉన్నదో నన్న భయంతో ఆత్రుతగా కవరు విప్పింది అహల్య.

"డియర్ అహల్యా!

రచయిత్రులంటే నాకెంత అభిమానమో నీకు తెలుసు. ఆ అభిమానంతోనే నిన్ను కట్నంకూడా తీసుకోకుండా పెళ్ళాడాను....నీకు అవసరమైన ప్రోత్సాహము, చేయూత ఇస్తూ వచ్చాను. కాని, దేనికైనా ఒక హద్దంటూ వుంది. అహల్యా! రచనలు చేయవలసిందే. రచయిత్రిగా పేరు తెచ్చుకోవలసిందే. అలాగని ఇంటిని, సంసారాన్ని నిర్లక్ష్యం చేసి కాదు. కట్టుకున్న భర్తను, కన్న బిడ్డను మరిచిపోయి కాదు....

అహల్యా! నువ్వు రాత్రీ, పగలూ అనకుండా రాసుకుంటూ కూర్చుంటే – పాపం అలసిపోతున్నావు, ఆరోగ్యం చెడగొట్టుకుంటున్నావన్న ఆతృతతో వంటపనిచేయడానికి వెనకాడలేదు నేను. యవ్వనపు కోర్కెలు కాగి చల్లారి పోతున్నా, మన యవ్వనం నిరర్థకమవుతున్నా ఎలాగో సహించాను. కాని, పసిపాప ఏడుస్తూవుంటే మాత్రం నా మనసు అంగీకరించలేకపోతోంది. నీ చర్యలను గర్హిస్తోంది. ఎదురు తిరుగుతోంది.

అహల్యా! నువ్వొక సుప్రసిద్ధ రచయిత్రివి. సంఘంకోసం దేశాభ్యుదయంకోసం నువ్వు కథలు, నవలలూ రాస్తూ వుండొచ్చును. నీ నవలల్లో, కథలలో జీవితసత్యాలెన్నో బోధిస్తూ వుంటావు. కాని, నీ జీవితానికి అవసరమయినదేమిటో తెలుసుకోలేకపోయావు. నీ సంసారాన్ని సుఖమయం చేసుకునే మార్గమేమిటో గ్రహించలేని నువ్వు – ఇతరులకు సందేశాల నివ్వడం ఫన్నీగా లేదూ?

ముఖ్యంగా ఏ స్త్రీ చేయని పొరపాటు చేసావు నువ్వు. ప్రేమానురాగాలను పంచి స్వయంగా సాకవలసిన కన్న బిడ్డనూ, కట్టుకున్న మొగుణ్ణీ మరో యువతికి అప్పగించావు. రచనలే జీవితానికి నిర్వచనమన్నట్లుగా ప్రవర్తిస్తున్నావు ఏదైనా మోతాదు మించితే ఏమవుతుందో మరిచిపోయావు. ఫలితంగా

నీలోని రచయిత్రి పట్ల నాకు వున్న గౌరవాభిమానాలను అసూయా ద్వేషా లుగా మార్చివేసావు.

రచయిత్రి భర్తగా ఏమేమో వూహించుకుని మురిసిపోయేవాణ్ణి కొత్తలో. కాని, క్రమంగా అవన్నీ ఎండమావులనీ, రాతలకూ - చేతలకూ నడుమ హస్తిమశకాంతర ముంటుందనీ గ్రహించి నిరుత్సాహం చెందాను....

ఏనాటికైనా నీ పొరపాటు నువ్వు గుర్తిస్తావనీ, మన దాంపత్యం బంగారు పండుగ చేస్తావనీ ఆశించాను. కాని.... ఆ ఆశలన్నీ అడియాసలు చేసావు. నా సహనాన్ని పరాకాష్ఠకు తెచ్చావు....మన మార్గాలు ఎప్పటికయినా కలుస్తాయన్న ఆశ నశించింది.

సో, అహల్యా! బాగా ఆలోచించి ఒక నిర్ణయానికి వచ్చాను....నీకు- నేను, పాప అవసరంలేదు....నీ రచనలే నీ లోకం. అవి వుంటే నిద్రాహారాలు కూడా అవసరంలేదు నీకు....కాని, ఆ జీవితము, మనుషులూ అంతా నాకు కావాలి! పిచ్చి ముదిరిన భార్య మనసు మారేంతవరకూ వోపికతో ఎదురుచూసేంతటి సహనం నాలో చచ్చిపోయింది.


శశిరేఖకు నాపైన అంతులేని ప్రేమానురాగాలు వున్నాయి. నన్ను, పాపను తన కంటిపాపల్లా చూసుకుం టోంది ఆ పిల్ల.

అందుకే వెళ్ళిపోతున్నాను అహల్యా! పాపనూ, రేఖనూ తీసు కొని వెళ్ళిపోతున్నాను. నాకేం కావాలో గ్రహించి, వన్నర్థం చేసుకున్న శశిరేఖను వివాహమాడి; నా జీవితం అర్థవంతం చేసుకుంటాను. 'రచయిత్రి భర్త' గా కాక, మరలా నేను-నేనుగా గుర్తింప బడేందుకు ప్రయత్నిస్తాను. పాపను - ఒక రచయిత్రి కూతురుగా కాక, తల్లి దండ్రుల ప్రేమానురాగాలను పంచుకువి పెరిగే అందాల బొమ్మలా పెంచు కుంటాను.

అహల్యా! కడసారిగా నీకు నేనివ్వ గలిగిన సలహా ఒక్కటే! నువ్వు ఆచరణలో పెట్టని విషయాలను గురించి రాయడం మానెయ్! రాతలకూ, చేత లకూ అన్వయం కుదిరిననాడే నువ్వు నిజమైన మనిషివవుతావు. లేకుంటే - అది జీవితం కాదు! ఎండిన మోడవు తుంది....

ఇకపైన నీ యిష్టం. ఎంతసేపైనా కూర్చుని రాసుకోవచ్చును. నిన్ను డిస్టర్బ్ చేసేవాళ్ళుండరు. కాని.... ఏ కీర్తి ప్రతిష్ఠల కోసమైతే నువ్వందరినీ నిర్లక్ష్యంచేస్తున్నావో - అవి లభించిన నాడు నీ ఆనందాన్నీ, అనుభూతినీ పంచు కునేందుకు ఆత్మీయులంటూ ఎవరూ మిగలక, అప్పుడు విచారిస్తావు.

అయాం సారీ, అహల్యా! ఎన్నో




కలలతో ఆరంభమయిన మన దాంపత్య జీవితం - ఇలా కలతలతో ఆఖరవుతున్నందుకు విచారిస్తున్నాను. 'ఐ రియల్లీ పిటీ యూ! ఇకనైనా జీవించడం నేర్చుకో....

ఆశీస్సులతో,
రాజారాం."

ఆ వుత్తరం చదువుకున్న అహల్య శిలాప్రతిమే అయింది

అంతలోనే తేరుకుని, "నో నో.... రచనలకోసం భర్తను, పాపను దూరం చేసుకోలేను. వాళ్ళ తరువాతనే తక్కినవన్నీను రచనల కోసం సంసారం నాశనం చేసుకోలేను. మొదట ఇల్లాలిని నేను. ఆ తరువాతనే రచయిత్రిని. ఇన్నాళ్ళూ అజ్ఞానంలో పడి ఆయన్ని బాధపెట్టాను ఆయన మనసెంత కష్టపడకుంటే ఇటువంటి నిర్ణయానికి వచ్చి వుంటారు! ....లేదు, అలా జరగడానికి వీల్లేదు.... నాకు కనువిప్పు కలిగింది.... నేను మారానని చెబుతాను. నా తప్పిదం క్షమించమని ఆయన్ని వేడుకుంటాను" అనుకుంటూ వాచ్ చూసుకుందామె.

'ఓహ్, ట్రెయిన్‌కు ఇంకా అరగంట టైముంది వాళ్ళింకా స్టేషన్‌లోనే వుంటారు....' అనుకుంటూ హడావుడిగా పరుగెత్తింది అహల్య.